ప్రజాశక్తి



ఎపిఆర్‌డిసిలో విజయ స్టేట్ ఫస్ట్

నరసన్నపేట: ప్రభుత్వం విడుదల చేసిన ఎపిఆర్‌డిసి ఫలితాల్లో నరసన్నపేటకు చెందిన అడప విజయ్ ఎంపిసి విభాగంలో రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించారు. మొత్తం 150 మార్కులకు 103 మార్కులు సాధించారు. మారుతీ నగర్‌కు చెందిన తండ్రి సింహాచలం లారీడ్రైవర్‌గా పనిచేస్తున్నారు. తల్లి గృహిణి. పదో తరగతి వరకు ప్రభుత్వ హైస్కూల్‌లో, ఇంటర్ సంపద సాయి జూనియర్ కళాశాలలో విద్యను అభ్యసించారు. తల్లతండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.



అభినందిస్తున్న సంపతసాయి స్కూల్ యాజమాన్యం

● ప్రభుత్వ విద్యను పేదలకు దూరం చేసేలా సర్కారు నిర్ణయాలు

● పూటకో ఉత్తర్వులతో గందరగోళం

● తొమ్మిది రకాలుగా పాఠశాలల విభజన

అంతా సందేహించినట్టే జరిగింది. ప్రభుత్వం విద్యా రంగానికి ఏదో మేలు చేస్తున్నట్లు అధికారంలోకి వచ్చిన కొత్తలో టిడిపి కూటమి ప్రభుత్వం బిల్డప్ ఇచ్చింది. గత వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ నంబరు 117తో విద్యా రంగానికి నష్టదాయకమంటూ దానిని రద్దు చేస్తున్నట్లుగా గొప్పగా ప్రకటించింది. దాని స్థానంలో వరుసగా వెలువరిస్తున్న జిఒలతో అంత కంటే ఎక్కువ ప్రమాదం వాటిల్లే అవకాశముందని ఉపాధ్యాయుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. పొయ్యి మీద నుంచి పెనంలోకి పడిన చందంగా ఉందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. పూటకో ఉత్తర్వును వెలువరిస్తూ ప్రభుత్వం గందరగోళం సృష్టిస్తోందంటూ ఉపాధ్యాయులు మండిపడుతున్నారు.

విద్యకు విపత్తు



ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ప్రభుత్వ, మండల, జెడ్‌పి, మున్సిపల్, గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యాన నడుస్తున్న పాఠశాలల పునర్నిర్మాణం పేరుతో ప్రభుత్వం ఈ నెల 13న జిఒ నంబరు 19, 20, 21 పేరుతో ఉత్తర్వులను వెలువరించింది. పాఠశాలలను తొమ్మిది కేటగిరీలుగా విభజిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొంది. మొదటి కేటగిరిలో ప్రీ ప్రైమరీ-1 (పిపి-1), ప్రీ ప్రైమరీ(పిపి-2)లకు శాటిలైట్ ఫౌండేషన్ స్కూల్స్‌గా, రెండో కేటగిరిలో పిపి-1, పిపి-2 ఒకటి, రెండో తరగతులను ఫౌండేషన్ స్కూల్‌గా పేర్కొంది. పిపి-1, పిపి-2, ఒకటి నుంచి ఐదో తరగతి వరకు బేసిక్ ప్రైమరీ స్కూల్స్‌గా నిర్ణయించింది. పిపి-1, పిపి-2, ఒకటి నుంచి ఎనిమిది వరకు ఉన్న తరగతులను ప్రాథమికోన్నత పాఠశాలలుగా విభజించింది. ఆరు నుంచి పదో తరగతి వరకు, ఒకటి నుంచి పదో తరగతి వరకు ఉన్న తరగతులను ఉన్నత పాఠశాలలు వర్గీకరించింది. ఆరు నుంచి 12 తరగతి వరకు, ఒకటి నుంచి 12 వరకు ఉన్న తరగతులను హైస్కూల్ ప్లస్‌గా విభజించింది.

జిల్లాలో పరిస్థితి ఇలా

ప్రభుత్వం వెలువరించిన ఉత్తర్వుల మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు ఇప్పటికే కసరత్తు చేశారు. జిల్లాలో కొత్తగా 248 ఫౌండేషన్ స్కూల్స్ రానున్నాయి. అదేవిధంగా 1620 పాఠశాలలను బేసిక్ పాఠశాలలుగా రూపాంతరం చెందనున్నాయి. 391 స్కూల్స్ మోడల్ ప్రైమరీ స్కూల్స్‌గా మారనున్నాయి. 420 ఉన్నత పాఠశాలలు, 198 ప్రాథమికోన్నత పాఠశాలలు ఏర్పడనున్నాయి. పాఠశాల పునర్నిర్మాణం ఫలితంగా 420 మంది స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మిగలనున్నాయి. వీరిలో 227 మందిని ప్రాథమిక పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులుగా, 193 మందిని స్కూల్ కాంప్లెక్స్‌లకు నియమించనున్నారు. దీంతో పాటు 324 సెకండరీ గ్రేడ్ పోస్టులు మిగలనున్నాయి.

కొత్త జిఒల పర్యవసనాలు ఇవే

పాఠశాల పునర్నిర్మాణం పేరుతో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో విద్యారంగం అస్తవ్యస్తంగా మారే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అటు ఉపాధ్యాయులకూ తీవ్ర నష్టం చేయనుందనే చర్చ నడుస్తోంది. ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ఒకటి నుంచి పది లేదా ఒకటి నుంచి 12 తరగతుల నిర్వహణకు మౌలిక వసతుల సమస్య తలెత్తనుంది. గదులు చాలకపోవడంతో రెండు చోట్లా ఒకే హెచ్ఎం పర్యవేక్షణ చేయాల్సిన పరిస్థితులు తలెత్తనున్నాయి. ఒకటి, రెండు తరగతులు ఫౌండేషన్ తరగతులుగా మార్పడం వల్ల 3,4,5 తరగతులు బేసిక్ ప్రైమరీ స్కూళ్లకు వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయని, దీంతో డ్రాపౌట్స్ పెరగనున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రాథమిక పాఠశాలల్లో డిఇడి చేసిన వారినే ఇప్పటివరకు ప్రభుత్వం ఉపాధ్యాయులుగా నియమిస్తోంది. పాఠశాల పునర్నిర్మాణం పేరుతో ప్రస్తుతం చేపడుతున్న ప్రక్రియలో భాగంగా వారిని ప్రైమరీ స్కూల్స్‌కు హెచ్ఎంలుగా నియమించడంపై ఉపాధ్యాయుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

ప్రభుత్వం మారినా అవే విధానాలు



విద్యారంగాన్ని నాశనం చేసేలా గత వైసిపి ప్రభుత్వం 117 జిఒ తీసుకొచ్చింది. ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వం అవే విధానాలను కొనసాగిస్తోంది. విద్యా రంగానికి తీవ్ర నష్టదాయకం. రోజుకో గైడ్ లైన్స్ పేరుతో గందరగోళం సృష్టిస్తోంది. అధిక శాతం పాఠశాలలు సింగిల్ టీచర్లుగా మారిపోనున్నాయి. తెలుగు రాష్ట్రంలో హైస్కూల్లో తెలుగు మీడియం లేకపోవడం విచారకరం. ప్రతి పంచాయతీలో మోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటు చేసి ఐదుగురి ఉపాధ్యాయులను నియమించాలి. ప్రాథమిక పాఠశాలలకు అన్ని సబ్జెక్టులకూ పోస్టులను మంజూరు చేయాలి. హైస్కూల్ ప్లస్ -2 పర్మినెంట్ టీచర్లను నియమించాలి. మిగిలిన స్కూల్ అసిస్టెంట్లను ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలలకు కేటాయించాలి.

- ఎస్.కిశోర్‌కుమార్, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

ప్రపంచ బ్యాంకు షరతులతో వినాశకర విధానాలు



పాఠశాల పునర్నిర్మాణం పేరుతో ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాల ఫలితంగా పోస్టులు పోతాయి. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ఇస్తున్నట్లు చెప్తున్నా అది సందేహమే. ఫౌండేషన్ స్కూల్ కాన్సెప్ట్ నష్టదాయకం. ఒకటి నుంచి పది, ఒకటి నుంచి 12 వరకు తరగతుల నిర్వహణకు పెను సమస్య, పర్యవేక్షణ సమస్యలు తలెత్తనున్నాయి. మిగిలిన స్కూల్ అసిస్టెంట్లను ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలుగా నియమించడం అసంబద్ధం. ప్రపంచ బ్యాంకు షరతుల మేరకే ఇటువంటి వినాశకర విధానాలను ప్రభుత్వం అమలు చేసేందుకు సిద్ధమవుతోంది. ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు ఐక్యంగా పోరాడితే తప్ప ప్రభుత్వం వెనక్కి తీసుకునే పరిస్థితి ఉండదు.

- పేడాడ కృష్ణారావు, డిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

పెనం మీద నుంచి పొయ్యిలోకి



విద్యా రంగానికి నష్ట తెచ్చే జిఒ నంబరు 117 రద్దు చేయమంటే టిడిపి కూటమి ప్రభుత్వం అంతకంటే ఎక్కువ నష్టం తెచ్చే జిఒలను తీసుకొచ్చింది. కొత్త జిఒలతో పెనం మీద నుంచి పొయ్యిలోకి పడినట్టు ఉంది. విద్యా రంగాన్ని అస్తవ్యస్తం చేస్తున్నారు. ప్రాథమిక విద్యను పేదలకు దూరం చేసేలా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోంది.

- మజ్జి మదన్‌మోహన్, ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు

ఇది తప్పుడు పద్ధతి



జిఒ నంబరు 117 మారిందే తప్ప అవే మార్గదర్శకాలు ఉన్నాయి. జిఒలో మార్పులు చేయకుండా అమలు చేస్తే బదిలీలు, చేస్తే ఉద్యమాలు తప్పవు. విధానాలు బాగో లేవు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికిప్పుడు ఇంగ్లీష్‌లోకి ఎలా మారతాయి. తెలుగు రాష్ట్రంలో తెలుగు మీడియం లేకపోవడం అన్యాయం. ఉపాధ్యాయుల్లో తీవ్రంగా వ్యతిరేకత ఉంది. ఇది తప్పుడు విధానం. **- తంగి మురళీ మోహనరావు, పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు**

విద్యారంగంపై తీవ్ర ప్రభావం



పాఠశాలల పునర్నిర్మాణం పేరుతో ప్రభుత్వం తీసుకొస్తున్న కొత్త విధానం విద్యారంగంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. పాఠశాల మూత, పిల్లల్లో డ్రాపౌట్స్ పెరిగే అవకాశం ఉంది. 30 మంది విద్యార్థులకు ఒకే టీచర్‌ను కేటాయిస్తాననడం సరికాదు. ఏకోపాధ్యాయుడితో బోధించడం వల్ల ఫౌండేషన్ స్కూల్స్ మూతపడే ప్రమాదం ఉంది. విద్యారంగానికి, ఉపాధ్యాయులకు నష్టం కలిగించే నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలి.

- డి.చందు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి



కళాజాతా నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

బలవంతపు భూసేకరణను సహించం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ప్రజల ఆస్తులను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడితే సహించేది లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ ప్రభుత్వాన్ని హెచ్చరిం చారు. వజ్రపుకొత్తూరు మండలం ఒంకులూరు గ్రామంలో కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యాన ఆకుపచ్చ జెండాను బుధవారం లోగోని ఆవిష్కరించారు. అనంతరం గ్రామాల్లో కళాకారుల బృందంతో కళాజాతాను నిర్వహిం చారు. ఈ కళాజాతాలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం కార్గో ఎయిర్‌పోర్టు పోరాట కమిటీ అధ్యక్షులు కొమర వాసు, కార్యదర్శి జోగి అప్పారావులు అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్గో ఎయిర్‌పోర్టు పేరుతో ప్రజల భూములు బలవంతంగా గుంజుకొని కార్పొరేట్ కంపెనీలకు కట్ట బెట్టి ప్రజలు నిరాశ్రయులుగా మారితే అభివృద్ధి ఎలా అవుతుందని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎయిర్‌పోర్టు పేరుతో లక్షలాది జీడి మొక్కలు నరికితే జీడి ఆధారిత పరిశ్రమలు దెబ్బతింటాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల వేలాదిమంది ఉపాధి కోల్పోతారని అన్నారు. మరోవైపున చెట్లు నరకడం వల్ల పర్యావరణం దెబ్బతిని తీవ్ర నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. ఆఫ్‌షోర్ రిజర్వాయరు పూర్తి చేసి పలాస ప్రజలు తాగడానికి మంచినీళ్లు ఇవ్వనేని మీరు కార్గో ఎయిర్‌పోర్టుతో అభివృద్ధి అవుతుందంటే హాస్యస్పదంగా ఉందన్నారు. ఎప్పటిలోగా ఆఫ్‌షోర్‌ను పూర్తి చేస్తారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్గో ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా గ్రామాల్లో విస్తృతంగా ప్రసారం చేసి విశాల ప్రజా మద్దతుతో ఉద్యమాలు ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనారి మోహనరావు, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యులు వంకల మాధవరావు, జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్, సిఐటియు నాయకులు ఎన్.గణపతి, కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు పి.కుసుమ, పి.దుర్యోధన, ధర్మారావు, దానేషు, రమేష్, చలపతి, పి.అరుణ, కె.బాలాజీరావు, కె.నీలకంఠం పాల్గొన్నారు.

జిజిహెచ్ సూపరింటెండెంట్ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలను స్వీకరిస్తున్న డాక్టర్ అమూల్య

శ్రీకాకుళం : సేవలే గుర్తింపునిస్తాయని ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.అమూల్య అన్నారు. ఈ మేరకు ఉద్యోగోన్నతిపై బదిలీపై వచ్చి బుధవారం బాధ్యతలు స్వీకరించిరించారు. ఈమె మెడికల్ కాలేజి విశాఖపట్న లో ప్రొఫెసర్ అండ్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్, గైనిక్ నుంచి ఉద్యోగోన్నతిపై వచ్చారు. సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.


మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

భూ సమస్యలపై చర్యలు తీసుకోవాలి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

రెవెన్యూ, భూ సమస్యలపై తహశీల్దార్లు తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. జెడ్‌పిలో వివిధ శాఖలకు సంబంధించి రెవెన్యూ, భూ సమస్యలు, ఎలినేషన్స్, మ్యుటేషన్లపైనపై జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నింటిని సరిచూసుకొని రెవెన్యూ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. జెడ్‌పి సిఇఒ ఎల్.ఎన్.వి.శ్రీధర్‌రాజ మాట్లాడుతూ డిఎల్ డిఒ కార్యాలయానికి రెండు ఎకరాలు అవసరం అవుతుందని చెప్పారు. ఆర్‌డిఒ సాయిప్రత్యూష మాట్లాడుతూ కలెక్టరేట్ నుంచి ప్రతిపాదనలు రావాల్సి ఉందని అన్నారు. టెక్కలి డివిజన్‌లో డిఎల్‌డిఒ కార్యాలయానికి ప్రభుత్వ భూమి అందుబాటులో లేదన్నారు. దేవాదాయ శాఖకు సంబంధించిన భూములు ఉన్నట్లు టెక్కలి ఆర్‌డిఒ కృష్ణమూర్తి వివరించారు. పలాస డివిజన్‌కు సంబంధించి భూములపై ఆర్‌డిఒ వెంకటేష్ కలెక్టర్‌కు తెలిపారు. మందసలో సెరికల్చర్ డిపార్ట్‌మెంట్ ఆక్రమణకు గురైందని, ఆక్రమణకు గురైన భూమిని తిరిగి అప్పగించాలని సెరీకల్చర్ ఎడి రాజేంద్రప్రసాద్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయం పునరావృతం కారాదని తహశీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. సీడ్స్ ఉత్పత్తికి జిల్లా కేంద్రంలో ఎకరా ప్రభుత్వ భూమి అవసరం అవుతుందని ఎడి చెప్పారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ భూమి అందుబాటులో లేదని రూరల్‌లో ఇచ్చేందుకు ఆర్‌డిఒ సాయిప్రత్యూషను ఆదేశించారు. రెవెన్యూ సమస్యలు ఏ ఒక్కటి పెండింగక్షలో ఉంచరాదన్నారు. మహిళా మరియు శిశు సంక్షేమ శాఖకు సంబంధించి జిల్లాలో వివిధ మండలాల్లో భూ సమస్యలు ఉన్నట్లు పీడీ బి.శాంతిశ్రీ చెప్పారు. అంగన్వాడీ భవనాలు, సిడిపిఒ కార్యాలయాలకు తహశీల్దార్లు భూములను గుర్తించి సంబంధించి ఆర్‌డిఒల ద్వారా కలెక్టరేట్‌కు ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్‌కు ఆదేశించారు. తీరప్రాంత తహశీల్దార్లు సిఆర్జెడ్ రూల్స్ తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. అటవీ చట్టాలపైన అవగాహన కలిగి ఉండాలని స్పష్టం చేశారు. తప్పుడు సమాచారం ఇవ్వకూడదని తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి పాల్గొన్నారు.

పౌర రక్షణ వాలంటీర్లుగా నమోదు

యువతకు మైభారత్ పిలుపు


ప్రజాశక్తి- శ్రీకాకుళం

భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా యువతను మైభారత్ పౌర రక్షణ వాలంటీర్లుగా నమోదుకు పిలుపునిచ్చిందని నెహ్రూ యువ కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ కె.వెంకట్ ఉజ్వల్ ఒక ప్రకటనలో తెలిపారు. నమోదు చేసుకున్న యువత జాతీయ ప్రయోజనాల్లో ముఖ్యంగా అత్యవసర పరిస్థితులు, సంక్షోభ సమయాల్లో కీలక పాత్ర పోషించడానికి సాధికారతను కల్పిస్తామన్నారు. ఈ సమిష్టి ప్రయత్నంలో భాగంగా ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు, ఇతరత్రా ఊహించని పరిస్థితుల్లో పౌర పరిపాలనపై పూర్తి అవగాహన కల్పించే శిక్షణను పొందానని అన్నారు. తదనుగుణంగా ప్రతిస్పందించే స్థితిస్థాపక స్వచ్ఛంద దళాన్ని నిర్ణయించడం ఈ చొరవ లక్ష్యమని అన్నారు. ప్రస్తుతం ఉద్భవిస్తున్న భద్రతా సమస్యలు దృష్ట్యా, బలమైన కమ్యూనిటీ అధారిత ప్రతిస్పందనకు యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం పెరుగుతుందన్నారు. పౌర రక్షణ వాలంటీర్లు ఈ విషయంలో కీలక పాత్ర పోసిస్తారని తెలిపారు. వీరికి రెస్క్యూ ఆపరేషన్, తరలింపు కార్యకలాపాలు, ప్రథమ చికిత్స, అత్యవసర సంరక్షణ, ట్రాఫిక్ కంట్రోల్ మేనేజ్‌మెంట్, జన సమూహ నియంత్రణ, ప్రజా భద్రత, విపత్తు ప్రతిస్పందన, పునరావాస ప్రయత్నాల్లో సహాయం చేయడం ఉంటాయని అన్నారు. 18 నిండిన 30 సంవత్సరాల్లోపు వారైన యువత భాగస్వామ్యం కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు నెహ్రూ యువ కేంద్ర కార్యాలయం పనివేళలో వచ్చి పొందవచ్చునని సూచించారు. వెబ్‌సైట్ https://mybharat.govt.inలో యువత ముందుకు వచ్చి ఈ జాతీయ లక్ష్యం కోసం ఆసక్తి గల యువత ప్రజలందరినీ సమీకరించాలన్నారు. మరిన్ని వివరాలకు 919910220993, 916395467609 సెల్ నంబర్లను సంప్రదించాలన్నారు.

ఈదురుగాలులతో భారీ వర్షం

ప్రజాశక్తి- ఆమదాలవలస, సరుబుజ్జిలి, కొత్తూరు, నరసన్నపేట

ఆమదాలవలస, సరుబుజ్జిలి, కొత్తూరు, నరసన్నపేట మండలాలతో పాటు మున్సిపాలిటీ పరిధిలో బుధవారం సుమారు గంట సమయం పాటు ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి తీవ్రమైన ఎండ, వడగాలులతో అల్లాడిపోయిన ప్రజలకు మధ్యాహ్నం మూడు గంటలకు వాతావరణంలో ప్రారంభమైన మార్పులతో ఆహ్లాదాన్ని ఆస్వాదించిన ప్రజలు ఈదురుగాళ్లు, వర్షం పడుతున్న సమయంలో భారీ శబ్దాలతో పిడుగులు మెరుపులు వినిపించడంతో ప్రజలు కొంతమేర భయాందోళనలకు గురయ్యారు. సుమారు గంట సమయం పడిన వర్షంతో వీధుల రహదారులు, ప్రధాన రహదారులు వర్షపునీటితో చిన్నపాటి నదులను తలపించాయి. కొన్ని గ్రామాల్లో తాత్కాలిక గుడారాలతో ఏర్పాటు చేసుకొని ఉన్న చిన్నపాటి షాపులు ఈదురుగాలులకు ఎగిరిపడ్డాయి. ఆకాశమంతా ఒక్కసారి మేఘావృత్తంగా మారి కారు చీకటి మధ్య చిరుజల్లులు పడడంతో రహదారులు కనిపించక వాహనాలు ఎక్కడెక్కడ నిలిపివేశారు. సరుబుజ్జిలి మండల కేంద్రంలో భారీ వర్షం వలన ప్రధాన నాలుగు రహదారులు వర్షపు నీటితో నిండిపోయి కాలువల్లోని మురికినీరు రహదారులపైనే ప్రవహించింది. ఆమదాలవలస పట్టణం గ్రామీణ ప్రాంతంలో భారీ వర్షం కురిసింది. రైల్వే స్టేషన్ ప్రాంతంలో కురిసిన వర్షంతో రైల్వే ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కనుగులవలస, కొర్లకోట, కలివరం, ముద్దాడపేట ప్రాంతాల్లో కురిసిన భారీవర్షంతో పొలాలన్నీ నీటితో నిండాయి. పట్టణంలోని ప్రధాన రహదారులన్నీ వర్షంతో జలమయం కాగా సుమారు రెండు గంటల సమయం జన సంచారం లేక మార్కెట్ ప్రధాన రహదారి బోసిపోయింది.


ఇసకలపేటలో నేలకొరిగిన మర్రి చెట్టు


ఆమదాలవలస : వర్షంనీటితో నిండిన పంట పొలాలు

మండలంలోని తొగరాం పంచాయతీ ఇసకలపేట ప్రభుత్వ స్కూల్ సమీపంలో 150 ఏళ్ల చరిత్ర ఉన్న భారీ మర్రిచెట్టు బుధవారం సాయంత్రం వీచిన గాలులకు, వర్షానికి నేలకొరిగింది. పక్కనే ఉన్న అన్నపు రమణమూర్తి, ధనుంజయ, మురళి ఇళ్లపై పడడంతో దెబ్బతిన్నాయి. ఆ సమయంలో ఇళ్లల్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. చెట్టు కింద ఉంచిన అన్నపు రాజుకు చెందిన కారు స్వల్పంగా దెబ్బంది. కాగా, ఇటీవల సంభవించిన అగ్నిప్రమాదంలో సగభాగం చెట్టు కాలిపోయింది. ఆ సమయంలో పంచాయతీ అధికారులు స్పందించి మిగతా చెట్టును తొలగించి ఉంటే ఇళ్లకు నష్టం వాటిల్లి ఉండేదని కాదని బాధితులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం చెల్లించాలని కోరుతున్నారు.


కొత్తూరు : మృతి చెందిన గేదెను పరిశీలిస్తున్న విఆర్‌ఒ కళ్యాణి

నరసన్నపేట మార్కెట్, ప్రధాన రహదారి, కాంప్లెక్స్ ఆవరణలో వర్షపునీరు నిలిచిపోయింది. దీంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. వ్యాపారులు 5 గంటలకు దుకాణాలను మూసివేశారు.

కొత్తూరు మండలం కేంద్రంలోనిలోతుగడ్డ చలపతిరావు రైతుకు చెందిన గేదెల మందపై పిడుగు పడింది. గేదెలను మేతకోసం పొలానికి తీసుకెళ్లాడు. మేత మేస్తుండగా పిడుగు పడడంతో ఈ ప్రమాదంలో గేదె మృతి చెందింది. బాధిత రైతు సచివాలయానికి ఫిర్యాదు చేశారు. విఆర్‌ఒ కళ్యాణి పరిశీలించి నష్టాన్ని అంచనా వేశారు.


ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

సిందూర జలసిరి ప్రారంభం

ప్రజాశక్తి- పలాస

మహిళలు తాగునీటి కష్టాలు చూసి తాను ఇచ్చిన మాటకు కట్టుబడి ఉద్దానం మంచినీటి ప్రాజెక్టు ద్వారా పట్టణానికి నీరు అందించడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. కాశీబుగ్గలో ఉద్దానం మంచినీటి ప్రాజెక్టు ద్వారా పట్టణానికి నీరు అందించేందుకు రూ.63 లక్షల వ్యయంతో నిర్మించిన సిందూర జలసిరిను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పట్టణ ప్రజలు తాగునీరు కోసం పడుతున్న ఇబ్బందులు చూశానని అన్నారు. ఎలాగైనా నీరు అందించాలని దృఢ సంకల్పంతో ముందుకు సాగానని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సహాయంతో ఉద్దాన మంచి నీటి ప్రాజెక్టు ద్వారా నీటిని మున్సిపాలిటీకు తీసుకురాగలిగామని అన్నారు. అనంతరం మున్సిపల్ అధికారులు గౌతు శివాజీ, గౌతు శిరీష, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబుకు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్ రామారావు, టిడిపి నాయకులు లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్, ఎం.నరేంద్ర, దువ్వాడ శ్రీకాంత్, వార్డు కౌన్సిలర్ డిక్కల ఆనంద్, మున్సిపల్ డిఇ కనకరాజు, ఎఇ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

స్తంభించిన సిఎస్‌పి రోడ్డు

నాలుగు గంటలు నిలిచిన వాహనాలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

జిల్లాలోని ప్రధాన రహదారుల్లో ఒకటైన కళింగపట్నం-శ్రీకాకుళం పార్వతీపురం సిఎస్‌పి రహదారి వాహనాలతో కిక్కిరిసి రాకపోకలు నిలిచి బుధవారం స్తంభించింది. శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస వరకు నాలుగు లైన్ల రోడ్డుగా ఇటీవల అభివృద్ధి చేశారు. ఈ రహదారి మధ్యలో రెండు చోట్ల కల్వర్టుల నిర్మాణం పేరుతో నిర్మించలేదు. కొత్త రోడ్డు సమీపంలోని చర్చి వద్ద ఉన్న ప్రధాన కాలువ కల్వర్టు గత కొంతకాలం నుంచి మరమ్మతులు చేపడుతున్నారు. బుధవారం వంజంగి, వంజంగిపేట, గట్టుముడిపేల గ్రామాల్లో అమ్మవారి పండగలు నిర్వహిస్తున్నారు. దీంతో ప్రజలు రాకపోకలు ఉదయం నుంచీ సాగిస్తున్నారు. ఉదయం 10 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా లారీలు, బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలు ఒక్కసారి రావడం, రోడ్డు ఇరుగ్గా ఉండడంతో వాహనాలు నిలిచిపోయాయి. సుమారు నాలుగు గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. ఇటు బలగ, అటు నందిగిరిపేట వరకు వాహనాలు నిలిచిపోవడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. మండుటెండలో నిలిచిపోవడంతో చిన్నారులతో వచ్చిన తల్లిదండ్రుల అవస్థల వర్ణనాతీతం. విషయం తెలుసుకున్న ఆమదాలవలస, శ్రీకాకుళం పోలీసులు ప్రధాన రహదారిపైకి వచ్చి కొత్త రోడ్డు నుంచి సింగపురం, చింతాడ మీదుగా తరలించారు. ముందుగా పోలీసులు వచ్చి రాకపోకలను క్రమబద్ధీకరిస్తే ఇటువంటి పరిస్థితి ఉండేది కాదని పలువురు వాహనదారులు ప్రజలు అభిప్రాయపడ్డారు. పోలీసులు తీరుపై వాహనదారులు ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. పూర్తిస్థాయిలో పనులు చేపట్టకపోవడంతో తరచూ ట్రాఫిక్ స్తంభిస్తుంది. త్వరితగతిన పనులు చేపట్టాలని కోరుతున్నారు.


నిలిచిన వాహనాలు



సోనోవాల్‌తో రామ్మోహన్ నాయుడు

సోనోవాల్‌తో రామ్మోహన్ నాయుడు భేటీ

శ్రీకాకుళం: ఆంధ్రప్రదేశ్‌ను భారత సముద్రాభివృద్ధికి ముఖద్వారంగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనికతను కొనసాగిస్తూ, కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాలశాఖ మంత్రి సర్బానంద సోనోవాల్‌ను కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఎపి ప్రభుత్వ పరిశ్రమలు, మౌలిక సదుపాయాల విభాగానికి చెందిన ప్రధాన కార్యదర్శి కూడా ఆయనతో పాటు ఉన్నారు. శ్రీకాకుళం జిల్లాలో నౌకాశ్రయం, ఓడరేవు మౌలిక సదుపాయాల అభివృద్ధిపై విస్తృతంగా చర్చించారు. లాజిస్టిక్ హబ్‌గా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్న దిశగా ఉప్పు భూముల వినియోగాన్ని గుర్తించి వాటిని ఆప్టిమైజ్ చేయాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. 974 కిలోమీటర్ల దీర్ఘ తీరరేఖతో పాటు 42 లక్షలకు పైగా శక్తివంతమైన మత్స్యకార సమాజం ఉన్న ఎపి, దేశ సముద్ర ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉందని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. ఓడరేవుల అభివృద్ధి ద్వారా సముద్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, మెరైన్ ఇన్నోవేషన్‌కు ఎపి కేంద్ర బిందువిగా మారేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన హితవు పలికారు.


వినతిపత్రం అందజేస్తున్న రైతులు

విద్యుత్ సమస్య పరిష్కరించాలి

ప్రజాశక్తి- కవిటి

విద్యుత్ సమస్యల కారణంగా బెజ్జిపుట్టుగ గ్రామ పరిధిలో సుమారు వంద విద్యుత్ మోటార్లు పనిచేయడం లేదని, దీంతో వ్యవసాయం చేయడం కష్టంగా మారిందని పలువురు రైతులు వాపోయారు. ఈ మేరకు బుధవారం రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ లైన్లు సక్రమంగా లేకపోవడంతో చాలా రోజులుగా వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్ సరఫరాలో సమస్యలు ఉత్పన్నమవుతున్నట్టు తెలిపారు. దీంతో అటు వ్యవసాయ, ఇటు ఉద్యాన పంటలకు నీటి సరఫరాలో తీవ్ర విఘాతం కలుగుతున్నట్టు వివరించారు. చొరవ తీసుకుని తమ సమస్యకు పరిష్కారం చూపించాలని కోరారు. కార్యక్రమంలో పొందల కృష్ణారావు, బొర్ర నరసింహమూర్తి, బొడ్డ మోహనరావు, పి.నారాయణమూర్తి, పి.ప్రసాదరావు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

స్వయం ఉపాధికి ప్రాధాన్యం

కవిటి: మహిళా సంఘాల సభ్యులకు స్వయం ఉపాధి కల్పనకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నట్టు ఎపిఎం సత్యనారాయణ, ఎపిఎం గోవిందరావు తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సర ప్రణాళికలో భాగంగా సంఘం సభ్యులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం కవిటి ఎంఎంఎస్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఎం మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు జీవనోపాధుల మెరుగుదల, వారి అవసరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ ఏడాదిలో రూ.120 కోట్ల లక్ష్యాన్ని చేరుకునేలా సభ్యులు చిత్త శుద్ధితో కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీనిధి మేనేజర్ రాము, సిసి రామకృష్ణ, ఎంఎంఎస్ అధ్యక్షు సోమన్, కోశాధికారి అర్చన పాల్గొన్నారు.

రాముకు సన్మానం

ప్రజాశక్తి- ఆమదాలవలస

జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో మండలంలోని అక్కులపేటకు చెందిన క్రీడాకారుడు సత్తారు రాము ప్రతిభ కనబర్చారు. ఈ నెల 4 నుంచి 8 వరకు బీహార్ రాష్ట్రంలోని రాజ్‌గిర్ వేదికగా 7వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ కబడ్డీ ఛాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్ బాలురు కబడ్డీ జట్టు తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించింది. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలం అక్కులపేటకు చెందిన క్రీడాకారుడు సత్తారు రామ్మోహన్‌కు పుష్పగుచ్చం ఇచ్చి దుశ్శాలువతో నియోజకవర్గ ఇండిపెండెంట్ అభ్యర్థి సువ్వారి గాంధీ సన్మానించారు. రాబోయే రోజుల్లో బాగా కష్టపడి మరిన్ని విజయాలు సాధించి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకొని రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. సువ్వారి అనిల్, పేడాడ వైకుంఠరావు, సువ్వారి రాధ, కోరుకొండ సాయికుమార్, పైడి విజయ్, బగాది నేతాజీ, తవిటిరెడ్డి, సూర కిరణ్, ధర్మ రాజశేఖర్, కుటుంబసభ్యులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

సత్యవరప్రసాద్‌కు అరుదైన గుర్తింపు

కవిటి: ప్రముఖ మృదంగ విద్వాంసుడు, కవిటి మండలం కుసుంపురానికి చెందిన బొంతల కోటి సత్య వరప్రసాద్‌కు మరో అరుదైన గౌరవం దక్కింది. కర్ణాటక సంగీతంలో భాగంగా మృదంగంలో ఆయన ఇచ్చిన ప్రదర్శనలు, కనబరిచిన ప్రతిభకు గుర్తింపుగా హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రం నుంచి సత్యవరప్రసాద్‌కు ఎగ్రేడ్ కళాకారుడిగా గుర్తింపు లభించింది. దీనికి సంబంధించిన ఉత్తర్వులు బుధవారం తనకు అందినట్టు తెలిపారు. ఇకపై ప్రభుత్వ కార్యక్రమాల్లో సత్య వరప్రసాద్ ఇచ్చే ఒక్కో ప్రదర్శనకు ప్రభుత్వం నుంచి రూ.11,100లు గౌరవ వేతనం లభిస్తుంది. కళల కాణాచి ఉద్దానం ప్రాంతం నుంచి ఇటువంటి అరుదైన గౌరవం పొందిన సత్య వరప్రసాద్ కు కళాకారులు, కళాభిమానుల, స్నేహితులు, సన్నిహితుల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

మంత్రిపై తప్పుడు ఆరోపణలు తగవు

నరసన్నపేట: పట్టణంలోని సొసైటీ పరిధిలో సైట్ అన్నీ ప్రభుత్వ ఆమోదలు పొంది చేపడుతున్న నిర్మాణాలపై వైసిపి నాయకులు తప్పుడు ఆరోపణ చేయడం తగదని టిడిపి టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి జామి వెంకటరావు అన్నారు. ఈ మేరకు స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జిల్లాలో చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు చూసి ఓర్వలేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గొద్దు చిట్టిబాబు, ఊర్ణ వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షులు కింజరాపు రామారావు, ఉపాధ్యక్షులు సాసుపల్లి కృష్ణబాబు, పీస కృష్ణ, బలగ ప్రహర్ష, గొలివి రామారావు, బోయిన సతీష్, బి.గోపి పాల్గొన్నారు.

ఇసుక వాహనాల సీజ్

కొత్తూరు: మండలంలోని అంగూరు ఇసుక ర్యాంపులో లారీ, రెండు ప్రొక్లెయినర్లు, మూడు తిప్పర్లను సీజ్ చేసినట్టు విఆర్ఓ దూరవాసులు బుధవారం తెలిపారు. సమాచారం అందుకున్న సిఐ చింతాడ ప్రసాదరావు, ఎస్ఐ మహమ్మద్ అమిర్ అలీ సంఘటన స్థలానికి చేరుకొని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.


స్వాధీనం చేసుకున్న వాహనాలు

20న సమ్మె జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- రణస్థలం

కార్మిక హక్కులు కాలరాసే లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థలు పరిరక్షణకై కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు 20న చేపట్టనున్న అఖిలభారత సమ్మె జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్. అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. బుధవారం రణస్థలంలో సిఐటియు మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాల పాటు కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మోడి నాయకత్వంలోని కేంద్ర బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారీ ప్రయోజనాల కోసం నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి వేసిందన్నారు. కార్మిక సంఘాలను బలహీనం చేసి యాజమాన్యాల శ్రమ దోపిడీని మరింత పెంచుకోవడం కోసం, యజమానుల దోపిడీని, అక్రమ తొలగింపులను, పనిభారాన్ని ప్రశ్నించే పరిస్థితి లేకుండా చేయడం కోసం, యజమానులు తమ ఇష్టానుసారంగా వ్యవహరించేలా, పెట్టుబడిదారులకు ఉద్యోగులను, కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చేవిధంగా కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వరంగ పరిశ్రమలు, రైల్వేలు, బ్యాంకులు, ఎల్ఐసి, రక్షణ రంగం, గనులు, ప్రకృతి వనరులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు ప్రైవేటీకరణను వేగవంతంగా అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కె.సుజాత పెద్దింటి కాంతమ్మ, ఎస్.జయలక్ష్మి, బి.గౌరి, కెల్ల ఉష, ఎ.అన్నపూర్ణ, ఎ.అరుణ పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపైన, లేబరు కోడ్లను రద్దుచేయాలని, డిమాండ్లతో కార్మికులు మే 20న దేశవ్యాప్తంగా చేపడుతున్న సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు నంబూరు షణ్ముఖరావు, హెచ్.ఈశ్వరరావులు పిలుపు ఇచ్చారు. టెక్కలి టాక్సీ స్టాండ్ వద్ద బొంతల సోమయ్య అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశంలో కార్మికులు నినాదాలు చేశారు. టాక్సీ స్టాండ్‌కు పర్మినెంట్ స్థలం కేటాయించాలని కోరారు. రెక్కలు ముక్కలు చేసుకుని రోజంతా కుటుంబం పనిచేసిన పొట్టనిండని పరిస్థితి ఏర్పడిందని, విద్య, వైద్యానికి కార్మికులు, కూలి కుటుంబాలు దూరమవుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో బగాది కృష్ణారావు, కార్మిక సంఘం నాయకులు బగాది హరి, ఉర్లాపు శ్రీను, రోకళ్ల రాజారావు, గేదెల జగదీష్, అల్లాడ కోదండ పాల్గొన్నారు.


రణస్థలం : మాట్లాడుతున్న అమ్మన్నాయుడు

గ్రంథాలయం సందర్శన

కొత్తూరు : స్థానిక శాఖాగ్రంథాలయలో వేసవి విజ్ఞానా శిబిరాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్‌రాజు, డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్. శంకర రావులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులు చక్కగా సమాధానం ఇవ్వడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. వీరితో గ్రంథాలయ అధికారి టి.ఇందిర, విశ్రాంత లైబ్రేరియన్ శ్రీరాములు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

ఇచ్ఛాపురం : పట్టణంలో ఉప్పలవీధిలో 7,8 వార్డులో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన వచ్చింది. టిడిపి ఇన్‌ఛార్జి రంగాల శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జెమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ షేక్‌సదాఫ్ వంద మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గోవింద్, రమేష్, జగదీష్, ఎన్.సంతోష్ పాల్గొన్నారు.



వైభవంగా పాలవలస అమ్మవారి సంబరాలు

సోంపేట : మండలంలోని పాలవలసలో నిర్వహిస్తున్న గ్రామ దేవత సంబరాలకు బుధవారం జనం పోటెత్తారు. గ్రామంలోని అన్ని విధులు విద్యుత్ దీపాలంకరణలతో కళకళలాడాయి. సాయంత్రం నుంచి పరిసర గ్రామాల నుంచి యాత్రికులు అమ్మవారిని దర్శించుకునేందుకు రావడంతో గ్రామం కిక్కిరిస్తుంది. గ్రామ దేవత ఊరేగింపులో విచిత్ర వేషధారణలు అలరించాయి. గురువారం రోషన్ లాల్ ఆర్కెస్ట్రా నిర్వహించబడుతుందని నిర్వాహకులు తెలిపారు. భక్తులకు ఎటువంటి సౌకర్యాలు లేకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్ల చేశారు.

కృష్ణదాస్ పరామర్శ

నరసన్నపేట : మండలంలోని చింతువానిపేటలో ఇటీవల మృతి చెందిన సురంగి రాజేశ్వరి కుటుంబ సభ్యులను వైసిపి జిల్లా అధ్యక్షులు బుధవారం పరామర్శించారు. ముందుగా రాజేశ్వరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి చింతు రామారావు, రాష్ట్ర పొందర కుల అధ్యక్షులు రాజాపు అప్పన్న, నియోజకవర్గ పంచాయతీరాజ్ అధ్యక్షులు బగ్గు రమణయ్య, మాజీ డైరెక్టర్ బబ్బాది ఈశ్వరరావు, ఎంపిటిసి నేతింటి రాజేశ్వరరావు, నడిమింటి శాంతారావు, మండల యూత్ ఉప అధ్యక్షులు తోట భార్గవ్, కనపల అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

మూల్యాంకన రెమ్యూనరేషన్ చెల్లించాలి

టెక్కలి: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా జిల్లాలో నిర్వహించిన మూల్యాంకనానికి సంబంధించిన రెమ్యూనరేషన్ చెల్లించకపోవడంతో ఉపాధ్యాయులు అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. పదో తరగతి పరీక్షలు పూర్తయి జవాబు పత్రాలని మూల్యాంకన కార్యక్రమం గత నెల 20 నాటికే పూర్తయింది. వారం రోజుల్లో ఇందుకు సంబంధించిన మూల్యాంకన రెమ్యూనరేషన్ ఆయా ఉపాధ్యాయులకు చెల్లించాల్సి ఉంది. కానీ, ఇప్పటి వరకు చెల్లింపులు చేపట్టలేదు. ఒకపక్క మూల్యాంకనం జరిగిన పదో తరగతి ఫలితాలు విడుదలై నెల రోజులు కావస్తుంది. కానీ, ఉపాధ్యాయులకు అందాల్సిన మూల్యాంకనం రెమ్యూనరేషన్ అందలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మూల్యాంకనానికి సంబ ంధించిన ఉపాధ్యాయుల రెమ్యూనరేషన్ చెల్లించాలని కోరుతున్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన

శ్రీకాకుళం రూరల్: మండలంలోని నైరా గ్రామంలో పారిశుధ్య పనులు ఏ విధంగా చేపడుతున్నారో ఎంపిడిఒ బొడ్డేపల్లి శైలజ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నైరా గ్రామాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దత్తత తీసుకున్నాయన్నారు. గ్రామానికి పారిశుధ్యం, అభివృద్ధి పనుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయిస్తారని, వాటి ద్వారా పారిశుధ్య, అభివృద్ధి పనులు ఏ విధంగా జరుగుతున్నాయో పరిశీలించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అరవల రామ్‌ప్రతాప్, వంశధార ప్రాజెక్ట్ చైర్మన్ అరవల రవీంద్ర, ఇఒపిఆర్‌డి సూర్యనారాయణ, కార్యదర్శి శ్రీను, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

ప్రభుత్వ విప్ బెందాళం అశోక్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మహిళల ఆర్థిక బలోపేతానికి ఎంతో మేలు చేసే ఉచిత కుట్టు శిక్షణా కార్యక్రమాలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. స్థానిక మున్సిపల్ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణా కార్యక్రమానికి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంతో మహిళలో కుట్టు శిక్షణలో ఆర్థిక పురోభివృద్ధి పొందుతారని అన్నారు. గత ప్రభుత్వం హయంలో ఉచితాలు వల్ల ఎంత మందికి సక్రమంగా ఉపయోగ పడిందన్నారు. ఎంపిడిఒ రామారావు, మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్, టిడిపి నాయకులు కాళ్ల ధర్మారావు, నందిక జాని, దక్కత డిల్లీరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


ప్రారంభిస్తున్న విప్ అశోక్

రైతు ఉత్పత్తిదారుల సమాఖ్యపై సమీక్ష

ప్రభుత్వ విప్ కార్యాలయంలో నాలుగు మండలాల ఎపిఎంలు, సెర్ప్ సిబ్బందితో సమీక్షించారు. ప్రతి మండలంలో రైతు ఉత్పత్తిదారుల సమైక్య ఆధ్వర్యాన జీవనోపాధి కార్యక్రమాలు ఏర్పాటు, వాటి విధి విధానాలు, ఏ రకమైన ఆదాయ అభివృద్ధి కార్యక్రమం చేపడుతున్నారన్నదానిపై సమీక్షించారు. కార్యక్రమంలో ఎపిఎంలు ప్రసాదరావు, కె.గోవింద, జి.అప్పలనర్సమ్మ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారం చేసుకోవాలి

ఎమ్మెల్యే గౌతు శిరీష


లాటరీ తీస్తున్న ఎమ్మెల్యే శిరీష

ప్రజాశక్తి- పలాస

ప్రతిఒక్కరూ తమ సొంతింటి కల సాకారం చేసుకోవాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. కాశీబుగ్గ ఉన్నత పాఠశాల ఆవరణలో సుడా ఆధ్వర్యాన మండలంలోని బొడ్డపాడు ఎంఐజి లేఅవుట్-2లోని ప్లాట్లను లాటరీ పద్ధతిని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం చౌకగా అందిస్తున్న ప్లాట్లలో ఇళ్లు త్వరితగతిన నిర్మాణం చేపట్టి కొత్త టౌన్‌షిప్ ఏర్పాటు అయ్యేలా చేద్దామన్నారు. పూర్తి స్థాయిలో ఇళ్లు నిర్మించుకుంటే పలాసలో అతిపెద్ద టౌన్ షిప్‌గా మారుతుందన్నారు. ఈ సందర్భంగా 240, 200, 150 చదరపు గజాల ప్లాట్లను లాటరీ పద్ధతిలో తీయగా, అధికారులు లాటరీలో ఎంపికైన లబ్ధిదారుల నుంచి ధ్రువపత్రాలు స్వీకరించారు. ఎంఐజి లేఅవుట్-1లో ప్లాట్లు రానివారికి వారం పది రోజుల్లో ఎంఐటి లేఅవుట్ 2లో కేటాయిస్తామని అన్నారు. లాటరీ ద్వారా ఎంపికైన వారికి త్వరలోనే ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపడతామని సుడా అధికారులు తెలిపారు. సమావేశంలో పబ్లిక్ హెల్త్ ఇఇ సుగుణాకరరావు, సుడా పిఒ డి.అమర్నాథ్, ఎపిఒ కృష్ణ, జెపిఒ శాస్త్రి, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ పి.మోహన్, పి.వెంకటేష్, సుడా సెక్రటరీ వి. లక్ష్మి పాల్గొన్నారు.

ఆందోళనలో యాత్రికులు

ప్రజాశక్తి- పలాస

చార్‌థామ్ యాత్రకు వెళ్లిన పలాస యాత్రికులకు అక్కడున్న ట్రావెల్ నిర్వాహకులు నగదు తీసుకొని హెలీకాప్టర్‌ను అందించకుండా మోసం చేసిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానిక పెంటవీధి, నెహ్రూ నగర్‌కు చెందిన పెంట రత్నాకర్, జామి గణపతి కుటుంబాలు ఉత్తరాఖండ్‌లోని చార్‌థామ్ యాత్రకు రెండు రోజుల క్రితం వెళ్లారు. వీరంతా ఓ ట్రావెల్ ఏజెన్సీ ద్వారా దర్శనం చేసుకోవాల్సి ఉంది. గంగోత్రిని దర్శించిన అనంతరం కేదారినాథ్ యాత్రకు హెలీకాప్టర్‌లో వెళ్లడానికి ఒకొక్కరికి రూ.15 వేలు చొప్పున ట్రావెల్ ఏజెన్సీకి నగదు చెల్లించారు. అనుకున్న ప్రకారం బుధవారం మధ్యాహ్నం యాత్రకు వెళ్లాల్సి ఉంది. అయితే వారికి నిర్వాహకులకు హెలీకాప్టర్ సమకూర్చలేదు సరికదా అడ్వాన్స్ ఇచ్చిన నగదు కూడా ఇవ్వడానికి సిద్ధంగా లేకపోవడంతో వారంతా అక్కడున్న పోలీసులను ఆశ్రయించారు. అంతకు ముందు భాషా సమస్య కారణంగా అక్కడున్న ఓ తెలుగు వచ్చే వ్యక్తికి వివరాలు చెబుతూ ట్రావెల్ నిర్వాహకులతో మాట్లాడించినా ఫలితం లేకపోయింది. తమకు న్యాయం చేయాలని యాత్రికులు కోరుతున్నారు.


ఆందోళన చేస్తున్న యాత్రికులు


మాట్లాడుతున్న రామారావు

వేసవి శిక్షణా తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని ఎర్రముక్కాంలో వే టూ సక్సెస్ సంస్థ ఆధ్వర్యాన బుధవారం ఉచితంగా వేసవి శిక్షణా తరగతులను ప్రారంభించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన ఐఆర్ఎస్ అధికారి కె.రామారావు మాట్లాడుతూ విద్యార్థులు ఈ శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం అర్థమెటిక్, రీజనింగ్, మ్యాథ్స్ ఫండమెంటల్, సైన్స్ ఫండమెంటల్, ఆరోగ్య విద్య మోటివేషన్ విభాగాలకు సంబంధించి మెటీరియల్ అందుబాటులో ఉంచినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే ఈ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా ఇటీవల ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొని వీర మరణం పొందిన మురళీనాయక్ చిత్రపటం వద్ద నివాళ్లర్పించారు. కార్యక్రమంలో జగన్, బైపల్లి దామోదరరావు, మురళి, సంధ్య పాల్గొన్నారు.

'జ్ఞానభారతి' విద్యార్థుల ప్రతిభ

ఇచ్ఛాపురం: సిబిఎస్ఇ పది, 12 తరగతుల పరీక్షా ఫలితాల్లో జ్ఞానభారతి విద్యార్థులు ప్రతిభ కనబరిచి తమ సత్తాను చాటారని పాఠశాల సిఇఒ, సెక్రటరీ జోహార్ ఖాన్ అన్నారు. ఈ మేరకు ప్రతిభ సాధించిన విద్యార్థులకు బుధవారం అభినందించారు. 12వ తరగతి బైపిసి విద్యార్థిని సి.పి.మౌనిక 371 మార్కులతో ప్రథమ, 345 మార్కులతో లిషితరెడ్డి ద్వితీయ స్థానంలో నిలిచారని అన్నారు. 16 మంది విద్యార్థులు 60 శాతానికి పైబడి మార్కులు సాధించారని తెలిపారు. ఆరుగురు విద్యార్థులు 55 శాతం నుంచి 60 శాతం వరకు మార్కులను సాధించారన్నారు. పదిలో కొర్రాయి అవినాష్ 565 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. దుంగ కాళీ అమర్నాథ్ పాఠశాలలో 513 మార్కులతో రెండో స్థానం సాధించాడన్నారు. 70 శాతం పైబడి 9 మంది విద్యార్థులు, 65 శాతం పైబడి 12 మంది, 25 విద్యార్థులు 50 శాతం పైబడి మార్కులను సాధించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐ.బి.పండా, హెచ్ఎం రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్‌కుమార్, అదనపు పరిపాలన అధికారిని సయ్యద్ సుల్తానా పాల్గొన్నారు.


అభినందిస్తున్న జోహార్ ఖాన్


అవార్డులను ప్రదానం చేస్తున్న సంఘ సభ్యులు


ఇష్టపడి చదివితే ఉన్నత లక్ష్యాలు

వజ్రపుకొత్తూరు: విద్యను ఇష్టపడి చదివిన విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత లక్ష్యాలు సాధిస్తారని శ్రీరామా సేవా సంఘం అధ్యక్షులు మొసా వరప్రసాద్ అన్నారు. మండలంలోని అక్కుపల్లిలో శ్రీరామా సేవా సంఘం ఆధ్వర్యాన ఇటీవల పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గ్రామస్థాయి ప్రతిభా అవార్డులను బుధవారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిభ గల విద్యార్థులను గ్రామ సంఘాల గుర్తించి ప్రోత్సహించడం ద్వారా వారు ఉన్నత శిఖరాలను అదిరోహిస్తారని అన్నారు. విద్యార్థి సమాజంపై అవగాహన పెంచుకుని క్రమశిక్షణ గల జీవితానికి బాటలు వేసుకోవాలని కోరారు. చదువులో పోటీతత్వం అలవర్చుకుని అనుకున్న ఆశయ సాధనకు నిరంతరం కృషి చేయాలని కోరారు. విద్యార్థులను ప్రోత్సహించాలనే సదుద్దేశంతో ఉత్తమ ప్రతిభా అవార్డులను ప్రదానం చేశామని తెలిపారు. కార్యక్రమంలో సేవా సంఘం ప్రధాన కార్యదర్శి అర్జాల ఈశ్వరరావు, కోశాధికారి కాస చల పతి, ఉప కార్యదర్శి సింగుపల్లి జగన్నాధం, ఎంపిటిసి మాజీ సభ్యులు బర్రి భూపతి, సూరాడ లోకనాథం పాల్గొన్నారు.

సిఎస్‌పి రహదారి పూర్తి చేయరూ..?

ప్రజాశక్తి- ఆమదాలవలస

శ్రీకాకుళం - ఆమదాలవలస ప్రధాన రహదారిపై అసంపూర్తిగా నిలిచిన రహదారి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు. శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస వచ్చే మధ్యలో కొత్తరోడ్డు దగ్గరలో ఉన్న చర్చి, టింపని స్కూల్, రిలయన్స్ పెట్రోల్ బంక్ దాటాక రహదారి పూర్తి అధ్వాన స్థితిలో ఉంది. ఈ రెండుచోట్ల కల్వర్టులు నిర్మాణం చేసి రహదారిని పూర్తి చేస్తామని గుత్తేదారు, అధికారులు గతంలో తెలిపారు. కల్వర్టులు పూర్తికావచ్చి సుమారు నెలరోజులు దాటినప్పటికీ రహదారి నిర్మాణం జరగకపోవడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. రాత్రిపూట ఈ రెండు చోట్ల రహదారి నిర్మాణం పూర్తి కాకపోవడంతో గుంతల్లో పడి వాహనదారులు, ప్రజలు గాయాల పాలవుతున్నారు. ఆమదాలవలస దరిలోని రిలయన్స్ పెట్రోల్ బంకు దాటిన వెంటనే పెద్దగుంత ఏర్పడి తరచూ ప్రమాదాలు జరగడంతో కొంతమంది వాహనదారులు గుంతకు అడ్డంగా పెద్ద బండరాళ్లు పెట్టి ఒక కర్రను ఏర్పాటు చేసి చెక్‌పోస్ట్ మాదిరిగా పెట్టి వాహనాలు అటువైపు పోకుండా, ప్రమాదాలు జరగకుండా నిలువరించేలా జాగ్రత్తలు తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక శ్రీకాకుళం, ఆమదాలవలస రహదారి పనులను 90 శాతం పూర్తి చేసి ఈ రెండు చోట్ల పూర్తి చేయకపోవడం వలన రాత్రివేళ గుంతల్లో దిగి వాహనాలు మొరాయిస్తూ దెబ్బ తింటున్నాయని అలాగే ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని పలువురు వాపోతున్నారు. ఆర్అండ్‌బి కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్నప్పటికీ అధికారులు పట్టించు కోకపోవడం శోచనీయమని పలువురు వాహనదారులు, ప్రజలు వారి తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రహదారి నిర్మాణాన్ని పూర్తిచేసి పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని వాహనదారులు ప్రజలు కోరుతున్నారు.


సిఎస్‌పి రహదారిపై గుంతల వద్ద ఏర్పాటు చేసిన రాళ్లు

గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని మృతదేహం

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ పరిధిలో సుర్ల రోడ్డు ఆర్ఎస్ఎస్ సమీపంలో బుధవారం సంభవించిన రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు పలాస జిఆర్‌పిఎస్ హెడ్‌కానిస్టేబుల్ డి.హరినాథ్ తెలిపారు. మృతుడి వయసు 55-60 సంవత్సరాలు మధ్య ఉంటుందన్నారు. మృతుడు ఆరెంజ్ రంగు టీషర్ట్, ఆకు పచ్చని రంగు కలిగిన లుంగీ ధరించి ఉన్నాడని తెలిపారు. మృతుడు చేతి కర్ర, సంచి ఉందన్నారు. మృతుని గురించి తెలిసిన వారు 8985021143ను సంప్రదించాలన్నారు.

ఆటోడ్రైవర్ ఆత్మహత్య

ఎచ్చెర్ల: మండల పరిధిలో చిలకపాలెంకు చెందిన సారిపల్లి జనార్ధన్ (31) ఆటోడ్రైవర్ మంగళవారం రాత్రి పురుగుల మందు సేవించి శ్రీకాకుళం సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఎచ్చెర్ల పోలీసుల వివరాల మేరకు ఆటో నడుపుతూ జీవనం గడుపుతున్న జనార్ధన్‌కు మద్యం సేవించే అలవాటు ఉంది. వీటికి తోడు ఆరోగ్యపరమైన సమస్యలను ఎదుర్కొంటున్నాడు. మద్యం తాగొద్దని భార్య ధనలక్ష్మి ఎన్నిసార్లు చెప్పినా వినిపించుకోలేదు. ఈ క్రమంలో మంగళవారం శ్రీకాకుళం నగరంలో ఓ షాపులో పనిచేసేందుకు భార్య వెళ్ళగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో రాత్రి 7:30 సమయంలో పురుగుల మందు తాగాడు. విషయం తెలుసుకున్న భార్య ఇంటికి చేరుకొని భర్తను చికిత్స నిమిత్తం శ్రీకాకుళం సర్వజనాస్పత్రికి తరలించింది. చికిత్స పొందుతూ జనార్ధన్ బుధవారం ఉదయం 12 గంటల సమయంలో మృతి చెందాడు. మృతుడికి ఏడేళ్ల బాబు ఉన్నాడు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పశువుల పట్టివేత

రణస్థలం: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై రామతీర్థం జంక్షన్ వద్ద మంగళవారం రాత్రి ఐదు బొలెరో వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న 55 పశువులను స్వాధీనం చేసుకున్నట్లు జె.ఆర్.పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి బుధవారం తెలిపారు. శ్రీకాకుళం జిల్లా సమీపంలోని చుట్టుపక్కల ప్రాంతాల్లో పశువులు కొనుగోలు చేసి ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఐదు బోలేరో వాహనాల్లో తరలిస్తున్నారని పేర్కొన్నారు. మంగళవారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో ఐదు బొలెరో వాహనాలు వస్తుండగా తనిఖీ చేయగా వీటిని విశాఖపట్నం గొవధశాలకు తరలిస్తున్నట్లు తమ విచారణలో వెల్లడైందని పేర్కొన్నారు. పశువులకు సంబంధించిన తొమ్మిది మందిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని, పట్టుకున్న 55 పశువులను విజయనగరం జిల్లా గుజ్జింగివలస గోసంరక్షణ సొసైటీకి తరలిం చినట్లు తెలిపారు. తనిఖీల్లో పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం

పాతపట్నం: ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో చేపడుతున్న నాటుసారా తయారీపైన, అమ్మకాలపైన శ్రీకాకుళం ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావు, ఒడిశా రాష్ట్ర గంజాం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్లు సంయుక్తంగా బుధవారం దాడులు నిర్వహించారు. ఆంధ్రాలోని పలాస, మెళియాపుట్టి, కొత్తూరు మండలాలు, ఒడిశా రాష్ట్రంలోని పెద్దబురుజోల, చిన్నబురుజోల, మారంగి, సౌర తలసింగ్, గొరాయ్, సింగిపూర్ గ్రామాల్లో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 12,300 లీటర్ల పులిసిన బెల్లపు ఊటలను ధ్వంసం చేశారు. 1330 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిపై కేసులు నమోదు చేశారు. నాటుసారా తయారు చేసినా, విక్రయించిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ ఎక్సైజ్ ప్రదీప్‌కుమార్ సాహు, పాతపట్నం ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ కోటా కృష్ణారావు, సిబ్బంది పాల్గొన్నారు.

21న జాబ్‌మేళా

రణస్థలం రూరల్: నిరుద్యోగ యువతకు అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఈ నెల 21న ఎన్ఇఆర్ స్కూల్ ప్రాంగణంలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాబ్‌మేళాలకు సంబంధించి పోస్టర్‌ను జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ నెల 21న ఉదయం 9 గంటలకు జాబ్‌మేళా ప్రారంభమవుతుందన్నారు. 21 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, బిటెక్, బిఫార్మసీ చదివిన 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు గత అభ్యర్థులు అర్హులని తెలిపారు. naipunyam.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా అభ్యర్థులు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, రిఫరెన్స్ నంబర్‌తో పాటు ఆధార్, ఒరిజినల్స్, జెరాక్స్ కాపీలు, ఫోటో తీసుకు రావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 83176 52552, 8332039243 నంబర్లను సంప్రదించవచ్చన్నారు.

పాఠ్యపుస్తకాలు సిద్ధం

టెక్కలి: రానున్న విద్యా సంవత్సరంలో ఆరంభం నాటికే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించాలనే ఉద్దేశంతో ఇప్పటికే విద్యార్థులకు అందాల్సిన పాఠ్య పుస్తకాలు మండలంలో సిద్ధంగా ఉన్నాయి. టెక్కలి మండలంలో 88 పాఠశాలలకు గాను, 22,356 పాఠ్యపుస్తకాలు అవసరం. ఈ వేరకు 85 శాతం పుస్తకాలు సరఫరా అయ్యాయి. 88 పాఠశాల్లో 13 ఉన్నత పాఠశాలు, మూడు రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకూ పుస్తకాలు అంద జేయనున్నారు. తొమ్మిదో తరగతికి సంబంధించి గణితం పుస్తకాలు రావాల్సి ఉంది. 5వ తరగతి విద్యార్థులకు తెలుగు, ఆంగ్లం, గణితం, ఇవిఎస్, ఆంగ్లం వర్క్ పుస్తకాలు రావాల్సి ఉంది. విద్యార్థులకు రావాల్సిన బెల్ట్‌లు సరఫరా అయ్యాయి. స్థానిక బాలికోన్నత పాఠశాలలో పుస్తకాల గోదాం నుంచి మండలంలోని పాఠశాలల సముదాయాలకు సరఫరా చేస్తారు. అక్కడ నుంచి ఆయా పాఠశాలకు పుస్తకాలు సరఫరా చేస్తారు. పాఠ శాలలు తెరిచేనాటికే విద్యార్థులకు పుస్తకాలు అందజేయనున్నారు.

కాలువల అభివృద్ధికి నిధుల మంజూరు

ఆమదాలవలస: నియోజకవర్గంలోని బూర్జ మండలం నారాయణ పురం ఆనకట్ట కాలువల అభివృద్ధికి నిధులు మంజూరైనట్లు టిడిపి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. నాగావళి నది తమ్మినేని పాపారావు నారాయణ పురం ఆనకట్ట కుడి ప్రధాన కాలువ ద్వారా ఐదు అభివృద్ధి పనులు చేపట్టడానికి జిల్లా కలెక్టర్ రూ.34.63 లక్షల నిధులను మంజూరు చేసినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.